క్లుప్తంగా

కూలీల సంఖ్య పెంచాలి

చారకొండ: గ్రామాల్లో ఉపాధిహామీ పనుల్లో ఉపాధి కూలీల సంఖ్య మరింత పెంచాలని ఏపీడీ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని జూపల్లిలో బుధవారం ఉపాధికూలీలు పనిచేసే ప్రదేశాల్లో కూలీల పనిని పరిశీలించారు. అనంతరం ఉపాధి కార్యాలయంలో రికార్డులు, ఎవెన్యూ ప్లాంటేషన్ పరిశీలించారు. ఎంపీడీఓ జయసుధ, ఏపీఓ వాసుదేవ్, టీఏ యాదయ్య, ఎఫ్ఏ లక్ష్మయ్య ఉన్నారు.

ప్రయాణికుల వినతి



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్ నుంచి గతంలో తెల్లవారుజామున హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం ఒకే బస్సు నడవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. 25ఏళ్ల నుంచి తెల్లవారుజామున, రాత్రి సమయాల్లో రెండు బస్సులు ప్రత్యేకంగా ఉండేవని, ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా గతంలో వచ్చే విధంగా రెండు బస్సులకు సహకరించాలని కొల్లాపూర్ డిపో మేనేజర్‌కు నాయకులు, సర్పంచ్‌లు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్‌కె ఖాజా, మాజీ సర్పంచ్ రాజేష్, రఫియోద్దీన్ పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం

చారకొండ: మండల కేంద్రంలో ఉపాధిహామీ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ జయసుధ ఉపాధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల్లో ఉపాధి పనులపై కూలీల ఆధార్ సీడింగ్, హాజరు, పంచాయతీ ట్యాక్స్ వసూళ్లు, దళితబంధు యూనిట్‌లపై వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలని ఎంపీడీఓ అధికారులకు ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని అన్నారు. సమావేశంలో ఏపీఓ వాసుదేవ్ ఉపాధి అధికారులు తదితరులు ఉన్నారు.

చిన్న పిల్లలను అంగన్‌వాడీలో చేర్చాలి



చారకొండ: 3 నుంచి 4ఏళ్ల చిన్న పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌ల్లో చేర్పించాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉపసర్పంచ్ రాణి నరేందర్ రెడ్డి అధ్యక్షతన పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ హాజరై మాట్లాడారు. చిన్న పిల్లలను అంగన్‌వాడీలో చేర్చడంతో పిల్లలకు వస్తువులను గుర్తించడం ద్వారా మనోవికాసం, ఆలోచన విధానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

హక్కులపై అవగాహన



కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల దినోత్సవం, వినియోగదారుల హక్కులు, చట్టాలపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.మల్లేశం, వైస్ ప్రిన్సిపాల్ రామరాజు యాదవ్, ఆర్థిక శాస్త్రం అధ్యాపకులు వెంకటయ్య వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు స్వర్ణలత, కురుమయ్య, శివుడు, మౌనిక, సోఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులను ఆదుకోవాలి

మన్ననూర్: రాష్ట్రంలో దారిద్ర్రరేఖకు దిగువగా ఉన్న ఆర్యవైశ్యులను ఆదుకోవాలని కోరుతూ ఎమ్మెల్సీ బుగ్గారం దయానంద్‌ను బుధవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేయనున్నట్లు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు వెంకటరమణ, సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కార్పొరేషన్, పావలా వడ్డీ రుణం అమలు చేయాలని పేర్కొన్నట్లు తెలిపారు. అదేవిధంగా అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇవ్వాలని కోరారు.

జైభీం దీక్షలు ప్రారంభం

నాగర్‌కర్నూల్‌రూరల్: జైభీం దీక్షా సమితి ఆధ్వర్యంలో బుధవారం కాన్షీరాం జయంతిని మొదలుకొని ఏప్రిల్ 14వ తేది వరకు చేపట్టనున్న జైభీం దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దీక్షల గౌరవాధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్ మాట్లాడుతూ మద్యపానం, మాంసాహారం ముట్టకుండా క్రమశిక్షణతో జీవనాన్ని కొనసాగించి మహాత్మజ్యోతిబా పూలే, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రాం, కాన్షీరాం ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాజకీయ, సామాజిక, అవగాహనను కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో జైభీం దీక్షా సమితి అధ్యక్షుడు దేవరపాగ బంగారయ్య, కార్యదర్శి కొత్త పరుశరాములు, సీనియర్ నాయకులు వడ్డేమాన్ విష్ణుమూర్తి, నల్లవెల్లి కృష్ణయ్య, చందుబట్ల నాగయ్య,మాజీ ఎంపీటీసీ కొత్త గంగాధర్ పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు



బల్మూర్‌లో నిఖిత ఆత్మహత్యకు నిరసనగా రాస్తారోకో చేస్తున్న అఖిల పక్ష పార్టీల నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: అమ్రాబాద్ మండలం మన్ననూరులో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న నిఖిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరిస్తున్నారని, అసలైన వాస్తవాలను వెలికి తీయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిఖిత మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని, వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆమె కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, కాశన్న పాల్గొన్నారు.

బల్మూర్: నిఖిత ఆత్మహత్యపై విచారణ చేసి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు ఎమ్మార్పీఎస్, అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం బల్మూర్‌లో అచ్చంపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా అఖిల పక్ష పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యం మహిళలపై వేధింపులు, అత్యాచారాలు, విద్యార్థినులపై ర్యాగింగ్‌లు పెచ్చుమీరుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడమే కాకుండా నిందితులకు బాసటగా కొమ్ముకాస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు పెద్దయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జగదీష్, ఎం ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్, బీసీ సంఘం అధ్యక్షుడు కాశన్నయాదవ్ పాల్గొన్నారు.

మన్ననూర్: స్థానిక గురుకుల పాఠశాలలో మృతి చెందిన నిఖితకు న్యాయం కోసం అఖిల పక్షం ఆధ్వర్యంలో గురువారం తలపెట్టిన అచ్చంపేట పట్టణ బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు మల్లికార్జున్, ఎంఆర్‌పీఎస్ నాయకులు కాశీం పిలుపునిచ్చారు. నిఖితను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పాల్గొననున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంటేష్, మహేష్, కృష్ణ పాల్గొన్నారు.

నేడు అచ్చంపేట బంద్

అచ్చంపేట రూరల్: మన్ననూరు గురుకుల పాఠశాలలో ఏడో తరగతి నిఖితది హత్యనా, ఆత్మహత్యనా అని విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, అఖిలపక్ష పార్టీలు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం అచ్చంపేట బంద్ చేపడుతున్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సోట కాశీం బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



వెల్దండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలకు పంపిస్తున్న ఉపాధ్యాయులు

కొల్లాపూర్: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఫస్టియర్ తెలుగు పరీక్షలు జరిగాయి. పట్టణంలోని ఆర్ఐడీ ప్రభుత్వ బాలుర, బాలిక జూనియర్ కళాశాల, గాయత్రీ జూనియర్ కళాశాల, మహాదేవి జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారు. 772 మంది విద్యార్థులకు 67 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రా వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. అయితే పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించలేదు.

మన్ననూర్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నట్లు నిర్వాహకులు సుధారాణి తెలిపారు. మండల కేంద్రంలోని ఇంటర్ కళాశాలతో పాటు మన్ననూర్‌లోని పీటీజీ, సాంఘిక సంక్షేమ గురుకులం (బాలికలు), కస్తూర్బాకు చెందిన మొత్తం 265 మంది విద్యార్థులకు 8 మంది గైర్హాజరయ్యారు. ఎస్ఐ వీరబాబు నేతృత్వంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వెల్దండ: మండల కేంద్రంలో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 146మంది విద్యార్థులకు ఇద్దరు గైర్హాజరైనట్లు చీఫ్‌సూపరింటెండెంట్ విజయలక్ష్మి తెలిపారు. మోడల్ హైస్కూల్‌లో 245మంది విద్యార్థులకు 7మంది గైర్హాజరైనట్లు చీఫ్‌సూపరింటెండెంట్ పుష్పలత పేర్కొన్నారు.

కల్వకుర్తి టౌన్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయని పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్ సురేందర్ రెడ్డి తెలిపారు. ఆరు కేంద్రాల్లో 1,511 మంది విద్యార్థులకు 125 మంది విద్యార్థులు హాజరుకాలేదు.

బల్మూర్: మండలంలోని కొండనాగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 319 మంది విద్యార్థులకు 26 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ షబేరాఖాత్‌న్ తెలిపారు.

కోడేరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 450మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 32మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ భల్లారి శేఖర్ తెలిపారు.

బీఎస్పీ జెండా ఎగురవేయడం ఖాయం



మాట్లాడుతున్న కొత్తపల్లి కుమార్

తాడూరు: సమాజంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా బీఎస్పీ పనిచేస్తుందని జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో బీఎస్పీ జెండాను ఎగరవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా ఈనెల 17న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాగర్‌కర్నూల్‌తోపాటు తాడూరు మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించనున్నారని అన్నారు. రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి వస్తే పేదలకు ఎకరా భూమి, మహిళల పేరుమీద ఇవ్వనున్నారు. ఉచిత విద్య, వైద్యం, చట్టసభలలో 14 సీట్లు మైనార్టీలకు, అసైన్‌మెంట్ భూములకు పూర్తి హక్కులు కల్పిస్తామన్నారు. ఐదేళ్లల్లో పది లక్షల ఉద్యోగాలను కల్పించడంతోపాటు పోడు భూములకు పట్టాలు ఇస్తామన్నారు. రాజ్యాధికార యాత్రలో భాగంగా మండల కేంద్రం నుంచి గుంతకోడూరు, పొల్మూరు, మేడిపూర్, ఆకునెల్లికుదురు, అంతారం, శిర్సవాడ, ఇంద్రకల్ గ్రామాలను పర్యటించి బీఎస్పీ జెండాలను ఆవిష్కరించనున్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కొ్ట్ర బాలు, లక్ష్మయ్య, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష పేపర్ లీక్‌కి వ్యతిరేకంగా నిరసన



కొల్లాపూర్‌లో రాస్తారోకో చేపట్టిన బీజేవైఎం నాయకులు

కొల్లాపూర్: టీఎస్‌పీఎస్‌సీ సైట్ నుంచి ప్రశ్నాపత్రాల లీక్ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బీజేవైఎం నాయకులు రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు ఇమ్రాన్, ఖలీల్, మేకల శివ, సంపత్, విజయ్, గుండాల శివ, రాములు, వినోద్, మధు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకు వ్యవహారంలో సీఎం కేసీఆర్ బాధ్యత వహించాలని యూత్ కాంగ్రెస్ అచ్చంపేట ప్రెసిడెంట్ అజయ్ యాదవ్, బీజేవైఎం నాయకుడు చందులాల్ చౌహాన్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, బీజేవైఎం ఆధ్వర్యంలో దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామనాథం, మల్లిఖార్జున్, రేణయ్య, కృష్ణ, పవన్, నరేష్, మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బుధవారం బీజేవైఎం ఆధ్వర్యంలో పరీక్ష పేపర్ లీకేజికి నిరసనగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో టీఎస్‌పీఎస్‌సీ పరీక్ష పేపర్లు లీకేజీలు అవుతున్నట్లు వారు ఆరోపించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు కంటం రవికుమార్, మల్లేష్, సింగల్‌విండో డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి, విష్ణుగౌడు, బాలకృష్ణ, అనిల్, శివప్రసాద్, లక్ష్మణ్ ఉన్నారు.

స్వచ్ఛ భారత్‌మిషన్‌పై అవగాహన

కొల్లాపూర్: స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు శ్రీనివాసులు, రామయ్య మాట్లాడారు. స్వచ్ఛ కార్యక్రమాలను గ్రామాల్లో ప్రణాళికతో నిర్వహించాలని సూచించారు. ఈ సదస్సుకు కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీఎంలు, సీసీలు, డీఆర్‌డీఏ, ఐకేపీ సిబ్బంది హాజరయ్యారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



కల్వకుర్తిరూరల్: మండల పరిధిలోని కురుమిద్దెలో బుధవారం మండల పరిషత్ అధ్యక్షురాలు మనోహర ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరుపట్టికను తనిఖీ చేసి ప్రతి ఒక కూలీకి ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం కురుమిద్దెలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని పాఠశాల, నర్సరీని ఎంపీపీ సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, సర్పంచ్ జ్యోతి రవీందర్, ఎంపీటీసీ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లిలో బుధవారం ఏపీజీవీబీ జూపల్లి శాఖ ఆధ్వర్యంలో బ్యాంకు సేవలపై ఖాతాదారులకు ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కర్నూల్ కళాజాతా వారు బ్యాంకు సేవలు, బ్యాంకులో సామాజిక భద్రత పథకాలు, వివిధ బీమా పథకాలు, బ్యాంకు లావాదేవీలపై, సైబర్ నేరాలపై ఆటాపాటలద్వార ఖాతాదారులకు అవగాహన కల్పించారు. బ్యాంకు లోన్, గోల్డ్ లోన్, మహిళ సంఘాల రుణాలను ఏవిధంగా ఉపయోగించుకోవాలి, సకాలంలో రుణాలు చెల్లించడం ద్వార ఖాతాదారులు మరింత లాభం పొందవచ్చు అని మేనేజర్ శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ జయ, చారకొండ ఏపీఎం బాలచంద్రయ్య, సీసీ విమల, బ్యాంకు సిబ్బంది ఖాదర్ పాష, సర్పంచ్ మహేష్, కళాజాతా బృందం సభ్యులు విజయ్, చిరంజీవి ఉన్నారు.

పెద్దమ్మగుడికి రూ.లక్ష విరాళం



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని కూరవారి ఎల్లమ్మ గుడి నిర్మాణం కోసం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పంపిన రూ.లక్ష విరాళాన్ని మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాగరాజు ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో రాజేశేఖర్, కరుణాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కురుమూర్తి, బాలనారాయణ, వెంకటస్వామి పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి



విద్యుత్ శాఖ సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ చంద్రశేఖర్

పెద్దకొత్తపల్లి: విద్యుత్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఏడీ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం విద్యుత్ శాఖ కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 3వ తేదీ నుంచి 12వ తేదీలోగా విద్యుత్ రీడింగ్‌లను చూసి నెల చివరి వరకు పూర్తి స్థాయిలో బిల్లులను వసూలు చేయాలని అన్నారు. విద్యుత్ ప్రమాదానికి గురై మృతిచెందిన రైతుల వివరాలు సేకరించాలని ఆయన సూచించారు. గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు సంబంధిత లైన్‌మెన్లు ఏఈకి సమాచారం అందించాలన్నారు. వ్యవసాయనికి రైతులు డీడీలు కట్టి సామగ్రి కోసం ఎదురు చూస్తున్నారని, క్రమ పద్ధతిలో వారికి సామగ్రిని అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈ ప్రదీప్‌గౌడ్, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు ఒరిగిందేమి లేదు

బిజినేపల్లి: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒరిగిందేమి లేదని, ఆ పార్టీ చేసిన వాగ్దానాలకు నెరవేర్చలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగం శశిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం తిమ్మాజీపేట మండలంలోని అమ్మపల్లిలో హాథ్ సే హాథ్ జోడో యాత్రను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి అమ్మపల్లికి చెందిన మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, కృష్ణయ్యతో పాటు గ్రామానికి చెందిన మరో 50 మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యేపై ప్రజా వ్యతిరేకమైన నల్లమట్టి దందా, ఎస్సీ ఎస్టీ, బడుగులపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ ప్రదీప్‌కుమార్

తెలకపల్లి: ప్రతి ఒక్కరు క్రీడాకారులుగా ఎదగాలని ఎస్ఐ ప్రదీప్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేకేరెడ్డి పాఠశాలలో రెండు రోజులుగా క్రీడా సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలతో సోదరభావం, స్నేహభావం పెరుగుతుందన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి, అకాడమిక్ సలహాదారుడు రఘురాంరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రభాకర్, బాలు, వ్యాయామ ఉపాధ్యాయుడు శివ, సాయి, బాలరాజు, కురుమూర్తి, నరేశ్ పాల్గొన్నారు.

నర్సరీలపై గ్రీన్‌నెట్ వేయించాలి

వెల్దండ: నర్సరీల్లో మొక్కల రక్షణకు ప్రతి నర్సరీపై గ్రీన్‌నెట్ వేయించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చెర్కూర్, గానుగట్టుతండా నారాయణపూర్, పల్గుతండా, భర్కత్‌పల్లి గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇచ్చిన టార్గెట్ ప్రకారం నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వర్, ఈసీ దేవేందర్‌గౌడ్, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

ఈజీఎస్ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఈజీఎస్ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీచేస్తున్న ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు

ఉప్పునుంతల: మండల కేంద్రం శివారులో కొనసాగుతున్న జాతీయ ఉపాధిహామీ పథకం పనుల వద్ద బుధవారం ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు, ఈజీఎస్ ఏపీఓ సుదర్శన్‌గౌడ్ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కూలీల మస్టర్లను ఎంపీడీఓ తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్నందున కూలీలు ఉదయమే పనులను ప్రారంభించి మధ్యాహ్నం వరకు పూర్తి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎండలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఈజీఎస్ ఏపీఓకు ఎంపీడీఓ సూచించారు.

కాన్షీరాం స్ఫూర్తితో ముందుకెళ్దాం



కోడేరులో కాన్షీరాం జయంతి వేడుకలు నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

కల్వకుర్తిరూరల్: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరాం స్ఫూర్తితో పట్టణంలో పార్టీ జెండా ఎగరవేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆంజనేయులు, ఇన్‌చార్జ్ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బహుజన సమాజాన్ని ఏకం చేయడం కోసం కాన్షీరాం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేపట్టారన్నారు. కార్యక్రమంలో చందు, రాజు, శ్రీశైలం, మహేశ్, మల్లేశ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కాన్షీరాం జయంతి వేడుకలను బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు దర్గాస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కాన్షీరాంను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదిసోమనాథ్, రాము, రాజు, ఎల్లస్వామి, బాలకృష్ణ, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



తాళ్లపల్లిలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్



మర్రిపల్లిలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సర్పంచ్ పద్మ

తెలకపల్లి: కంటి వెలుగును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తాళ్లపల్లిలో కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు.

ఉప్పునుంతల: మండలంలోని మర్రిపల్లిలో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ మల్లయ్య ప్రారంభించారు. మొదటి రోజు గ్రామంలోని 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి కంటి చూపు మందగించిన 31 మందికి కంటి అద్దాలు అందజేయనున్నట్లు వైద్యాధికారిణి నందిని తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్యుడు దేవేందర్, డీఈఓ సుమతి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, ఏఎన్ఎం లక్ష్మీ, శ్రీను పాల్గొన్నారు.

బిజినేపల్లి: గాయపడిన చిన్నారులు ఎక్కువగా స్టెరైడ్స్ వాడటంతో గ్లూకోమా కంటి వ్యాధి వచ్చే అవకాశం ఉందని కుచుకుళ్ల రాంచంద్రారెడ్డి నేత్ర వైద్య శిబిరం అధికారి డా.దీపిక అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాములు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట, తోటపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. మండల పరిషత్ అధ్యక్షురాలు మనోహర బుధవారం మండలంలోని కురుమిద్దెలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె వెంట సర్పంచ్ జ్యోతి రవీందర్, ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌నాయక్, ఎంపీడీఓ ఆంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని చర్లిటికాలలో బుధవారం సర్పంచ్ శ్రీదేవి కంటి పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎండీ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.

తొలిమెట్టు రాష్ట్రబృందం పర్యటన



విద్యార్థులతో తొలిమెట్టు రాష్ట్ర బృందం

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను తొలిమెట్టు రాష్ట్రబృందం పర్యటించింది. ఈ మేరకు వారు కార్యక్రమంపై నివేదిక తీసుకున్నారు. బుధవారం మండలంలోని గుమ్మకొండ యూపీఎస్, తిమ్మాజీపేట జెడ్పీహెచ్ఎస్, ఎస్సీ కాలనీలోని పీఎస్‌ను సందర్శించారు. అనంతరం గొరిటలో రిసోర్స్ అధికారులతో తొలిమెట్టు కార్యక్రమంపై చర్చించారు.

తాడూరు: మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో తొలిమెట్టు కార్యక్రమాలను నోడల్ అధికారి తిరుపతయ్య బుధవారం పరిశీలించారు. పదోతరగతి ఇంటర్నల్ మార్కులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, భిక్షారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌కి చెందిన రైతు కుర్వ మద్దిలేటి కౌలు తీసుకొని మినుము సాగు చేస్తున్నాడు. అయితే ఇటీవల పంట కోసిన తర్వాత కుప్ప వేయగా గుర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పంటించడంతో కాలి బూడిదైంది. ఈ విషయం తెలుసుకున్న కొల్లాపూర్ మాజీ ఎంపీపీ గాదెల సుధారాణి, రత్న ప్రభాకర్ చారిటబుల్ ట్రస్ట్ నుంచి అందించిన ఆర్థిక సాయాన్నిసర్పంచ్ ఎస్‌కె ఖాజా చేతులమీదుగా అందజేశారు.